

ఏరువాకా సాగారో.. రైతన్న..

ప్రజాశక్తి- తాళ్లరేవు

రైతాంగం దుక్కులు దున్ని నారుమళ్లు వేసేందుకు సిద్ధం అవుతోంది. యంత్ర పరికరాలు రావడంతో సాధారణంగా రైతులు ఎద్దులు, పోతులతో దుక్కి దున్నడం మానేశారు. ఒక రైతు ఎద్దులతో అరక దున్ని ఆపై దుక్కు అనంతరం మడి చదును చేయడానికి ఎద్దులకు నాగలి కట్టి చదును చేశాడు. పాతకాలం నాటి సాంప్రదాయాన్ని మరొకసారి రైతు గుర్తు చేశాడు.



ఎద్దులతో ఏరువాక సాగిస్తున్న రైతు

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

- బహిరంగ సభలో సిపిఎం నాయకులు
- ముగిసిన సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనజీమ జిల్లా మహాసభ
- కన్వీనర్‌గా కారెం వెంకటేశ్వరరావు ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఎం నాయులకు పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్.అంబేదర్క కోనసీమ జిల్లా అమాలపురం ప్రెస్‌క్లబ్‌లో రెండు రోజుల పాటు జరిగిని సిపిఎం జిల్లా మహాసభ బుధవారంతో ముగిసింది. అనంతరం ప్రెస్‌క్లబ్ నుంచి ప్రదర్శన జరిగింది. తరువాత అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్బరావమ్మ మాట్లాడారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత హిందుత్వం పేరుతో మతఘర్షణలు పెరిగాయన్నారు. మనువాదాన్ని ప్రోత్సహిస్తూ దళితులు, బహుజనులపై దాడులకు పాల్పడుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల అయినా నేటికీ కులవివక్ష కొనసాగుతుందన్నారు. దళితులకు, గిరిజనులకు రక్షణగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని బిజెపి సర్కారు నీరు గార్చిందన్నారు. ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవహేళనగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరుతో జపం చేసి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గు చేటన్నారు. బిజెపి భారత రాజ్యాంగాన్ని నాశనం చేస్తుందన్నారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌ఎ ఐవి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ కౌలుదారు కార్డులు ఇవ్వాలన్నారు. వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో నిబంధనలను సడలించాలన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోనసీమలో రోడ్లు, కాలువగట్లకు ఇరువైపులా ఉన్న కొబ్బరి చెట్లను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకుని దళితులు, పేదలకు అందివ్వాలన్నారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలోనే స్వాధీనం చేసుకుంటామన్నారు. టిడ్కో లబ్ధిదారుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలన్నారు.




ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నాయకులు



సభలో మాట్లాడుతున్న మాల్యాద్రి, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

తొమ్మిది మందితో నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక

అమలాపురం ప్రెస్‌క్లబ్ పచ్చిమాల వసంతరావు నగర్‌లో జరిగిన సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభ బుధవారంతో ముగిసింది. నూతన కన్వీనింగ్ కమిటీ ఎన్నిక జరిగింది. సిపిఎం జిల్లా కన్వీనర్‌గా కారెం వెంకటేశ్వరరావు తిరిగి రెండోసారి ఎన్నికయ్యారు. కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా కె.కృష్ణవేణి, డాక్టర్ చల్లా రవికుమార్, డివి.రావు, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరాం, టి.నాగవరలక్ష్మి, ఎస్.జోగేష్, డిఎ.లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు.



కారెం వెంకటేశ్వరరావు
సిపిఎం జిల్లా కన్వీనర్



జి.దుర్గాప్రసాద్



ఎన్.బలరాం



కె.కృష్ణవేణి



సిహెచ్.రవికుమార్



నాగవరలక్ష్మి



డివి.రావు

తీర్మానాలు ఇవీ...

- శ్రామిక మహిళలకు కనీస వేతనాలు చెల్లించాలి, ఉద్యోగ భద్రత కల్పించాలి
- కౌలు రైతులందరికీ కౌలుదారు కార్డులు అందించాలి. అన్ని వ్యవసాయ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి..
- దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను అరికట్టాలి
- కరెంట్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి.
- కొబ్బరి ఒలుపు, దింపు ఇతర అనుబంధ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

20 నుంచి కాకినాడ జిల్లా మహాసభ

సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్

ప్రజాశక్తి - పెద్దాపురం

సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభలు ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు పార్టీ కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. స్థానిక యాసలపుప సూర్యారావు భవనంలో మహాసభల కరపత్రం ఆవిష్కరణ అనంతరం సిపిఎం మండల కన్వీనర్ డి.క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలక పార్టీలు రాజకీయ అంశాలు తప్ప అభివృద్ధి అంశాలను విస్మరించాయన్నారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలు గాలికి వదిలేశాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కాకినాడ సెజ్‌లో 8 వేల ఎకరాలు ఖాళీగా ఉన్నా అన్నవరంలో ఎయిర్ పోర్టుకు మూడు పంటలు పండే భూములు సేకరించడం అన్యాయమన్నారు. నిరంతరం మతం పేరుతో రాజకీయాలు నడుపుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఈ జిల్లాలో ఉన్న వనరులను కాపాడుకుంటూ జిల్లాను ఏ విధంగా అభివృద్ధి చేయాలో పాలకులు ఆలోచించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరాయంగా ప్రజలపై భారాలు మోపుతూనే ఉన్నాయన్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న కాకినాడ పోర్టుపై దుష్ప్రచారం సాగిస్తూ పోర్టును నిర్వీర్యం చేస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా వ్యవసాయ అభివృద్ధికి చేపట్టవలసిన విధానాలను విస్మరించారన్నారు. ఏటిపట్టు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే ఏలేరు ఆధునీకరణ పనులు నేటికీ పూర్తి చెయ్యకపోవటం అన్యాయమన్నారు. తీర ప్రాంత మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ఈ మహాసభలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరాటాలు, విజయాలపై చర్చించి భవిష్యత్తులో చేపట్టవలసిన ప్రజా పోరాటాలపై నిర్ణయాలు తీసుకుంటారన్నారు. క్రాంతి కుమార్ మాట్లాడుతూ 20న సూర్యారావు భవనంలో ఫోటో ఎగ్జిబిషన్, కవితా గోష్టి, కవితా సంకలనం ఆవిష్కరణ ఉంటాయన్నారు. 21న మధ్యాహ్నం 2:30 గంటలకు మున్సిపల్ సెంటర్ నుంచి ప్రదర్శన, సాయంత్రం మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడి సెంటర్లో బహిరంగ సభ ఉంటాయన్నారు. 21, 22 తేదీలలో పాశీల వారి వీధిలోని కొప్పుల వెలమ సంక్షేమ సంఘ భవనంలో ప్రతినిధుల సభ ఉంటుదని, బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-కాజులూరు

సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు ఏర్పడ్డాయని, ప్రతి సహకార సంఘంలోనూ భూములు ఉన్న ప్రతి రైతూ సభ్యునిగా ఉండాలని వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే ఉద్దేశంతో సహకార సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిపై కార్యకర్తలను నియమించారన్నారు. నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో సహకార సంఘాల అభివృద్ధి కుంటు పడిందన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని నిశ్చయంతో ప్రభుత్వం సహకార సంఘాల వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వాలు కార్యకర్తలకు పదవులు ఇవ్వాలనే ఉద్దేశంతో నామినేటెడ్ పదవులు ఇస్తోందన్నారు. రైతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సహకార సంఘాల ఎన్నికలను నామినేటెడ్ పద్ధతిపై కాక పోటీ పద్ధతిపై నిర్వహిస్తే రైతుల ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.

అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-కాకినాడ


డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అంబేద్కర్ పేరు స్మరించి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గు చేటన్నారు. మతోన్మాద ప్రభుత్వంలో రాజ్యాంగంపై, ప్రభుత్వరంగ సంస్థలపై దాడి చేస్తూ మరో పక్క అంబేద్కర్ ఫొటోలను మాత్రం ఎన్నికల ప్రచారంలో వేసుకోవడం దేనికని ప్రశ్నించారు. ఓట్ల కోసం అంబేద్కర్ ఫొటో కావాలి కానీ, ఆయన సిద్ధంతం పాటింపు అక్కరలేదా అని ప్రశ్నించారు. కుల వ్యవస్థకు జీవం పోసి, పెంచి పోషిస్తున్న మనువాద వర్ణ వ్యవస్థ ఉండరాదని, దానికి మూలమైన మను స్మృతిని అంబేద్కర్ తగులబెట్టారని తెలిపారు.

హరిప్రియకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గతంలో గొల్లప్రోలు ఎంపిడిఒగా కొంతకాలం పని చేసి అనారోగ్య కారణంతో లీవ్‌పై వెళ్లిన పి.హరిప్రియ మృతి చెందడంతో అధికారులు ఆమెకు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఎంపిడిఒ కె.స్వప్న మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా పనిచేసిన హరిప్రియను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.శివప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసా దేవి, పిహెచ్‌సి పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





భవిత సెంటర్‌ను సందర్శించిన అధికారులు

భవిత సెంటర్ సందర్శన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలో భవిత సెంటర్‌ను బుధవారం ఎస్ఎస్ఎఇఆర్ఐ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒ-2 బివిఎస్ ప్రసాద్ సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. టిఎల్ఎం గురించి, విద్యార్థుల సర్వే రిపోర్ట్‌ల గురించి, సిలబస్ గురించి, ఉపాధ్యాయుల డైరీల గురించి పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం స్థానిక మండల వనరుల కేంద్రాన్ని వారు సందర్శించారు.

సైనిక్ పాఠాశాలల్లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

సైనిక్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు, తొమ్మిది తరగతుల్లో ప్రవేశం కోసం ప్రస్తుతం 5, 8 తరగతులు చదువుకునే విద్యార్థులకు ఈ అవకాశం ఉందన్నారు. దేశభక్తిని చాటుకోవాలనే విద్యార్థులకు సైనిక్ పాఠశాలలు చక్కని అవకాశం కల్పిస్తున్నాయన్నారు. సైనిక్ పాఠశాలల్లో 2025-26 ఏడాదిలో ఆరు, తొమ్మిదో తరగతుల్లో ప్రవేశం పొందడానికి నోటిఫికేషన్ విడుదలైందని, దేశ రక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అవసరమైన సైనిక అధికారులను తయారు చేయాలనే లక్ష్యంతో దేశ వ్యాప్తంగా సైనిక్ పాఠశాలలను ప్రారంభించారన్నారు. ప్రవేశ పరీక్ష 2025 జనవరి 28న నిర్వహిస్తారని తెలిపారు. www.aissee.nta.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

కార్మిక సంఘం నేత విజయరావు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం సైకిల్ మెకానిక్ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు కరణం విజయా రావు (75) బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సంతాప సూచికంగా పట్టణంలో సైకిల్ మెకానిక్‌లు బంద్ నిర్వహించారు. ఆయన మృతికి సైకిల్ మెకానిక్ యూనియన్ నాయకులు కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, గుడిసి బాబూరావు, షేక్ మదీనా, శ్రీను, సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్, వడ్డి సత్యనారాయణ, గూనూరు వెంకటరమణ తదితరులు సంతాపం తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - తాళరేవు

ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వమే నేరుగా అదానీ ప్రతినిధులతో కలిసి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి, జనసేన నేతలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దీనిపై త్వరలో ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని ఈశ్వరరావు హెచ్చరించారు.

ప్రజా ఉద్యమాల్లో ముందు పీఠిన సిపిఎం

- సమస్యలపై అనేక పోరాటాలు
- కార్పొరేట్లపై రాజీలేని పోరు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పీడిత ప్రజల పక్షాన ముందు వరుసలో నిలబడి సిపిఎం ప్రజా ఉద్యమాలను నిరంతరం కొనసాగిస్తోంది. సామాన్య ప్రజలకు అండదండలుగా నిలబడుతూ కార్పొరేట్లపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ రంగ పరిరక్షణకు సామాజిక న్యాయం, లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి నిరంతరం ఉద్యమాలు చేపడుతోంది. బిజెపి మతోన్మాదాన్ని సవాలు చేస్తూ మతసామరస్యానికి, దేశ సమైక్యతకు కట్టుబడి కృషి చేస్తుంది. సిపిఎం కాకినాడ జిల్లా 24వ మహాసభలు ఈ నెల 20, 21, 22వ తేదీల్లో పెద్దాపురంలో జరగనున్నాయి. 2021 డిసెంబర్ 15, 16వ తేదీల్లో ఉమ్మడి జిల్లా 23వ మహాసభలు రామచంద్రాపురంలో జరిగాయి. గత మహాసభల నుంచి ఇప్పటివరకు వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ మూడేళ్ల కాలంలో సిపిఎం నిర్వహించిన ప్రధాన ప్రజా ఉద్యమాలు, సాధించిన విజయాలివి.

కాకినాడ, అనకాపల్లి జిల్లాల సరిహద్దులో ఉన్న తాండవ సుగర్ చక్కెర పరిశ్రమ క్రషింగ్ నిలిచిపోవడంతో ఇటు రైతులు ఆందోళనకు గురవుతుండగా భారీగా పేరుకుపోయిన బకాయిలు మూడేళ్లుగా విడుదల చేయకపోవడంతో అటు కార్మికులు తీవ్ర కలత చెందారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు, అలవెన్స్‌లు, పిఎఫ్, ఇతర సొమ్ములు మొత్తంగా రూ.10 కోట్లుపైనే ఇవ్వాల్సి ఉంది. బకాయిలు చెల్లించడం కోసం సిపిఎం రైతులు, కార్మికుల పక్షాన నిలిచి దశలవారీగా పోరాటాలు చేసి బకాయిలు విడుదలకు కృషి చేసింది. ప్రత్తిపాడు నియోజకవర్గం సబ్ ప్లాన్ పరిధిలో 56 గ్రామాల ప్రజలు అనేక ఏళ్లుగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలను ఐటిడిఎలో విలీనం చేయాలని గిరిజనులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో సిపిఎం వారికి అండగా నిలిచింది. పలు దఫాలుగా జరిగిన పోరాటాల్లో ముందు పక్షాన నిలిచి సమస్యలపై గళం ఎత్తింది. కుల ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వం నుంచి రావడానికి కృషి చేసింది. గడచిన మూడేళ్లలో కాకినాడలోని రెండు భారీ పరిశ్రమల్లో ప్రమాదాలు జరగా కార్మికుల కుటుంబాలకు అరకొర పరిహారం ఇచ్చి యాజమాన్యాలు చేతులు దులుపుకోవాలని చూశాయి. దీంతో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు బాధితుల పక్షాన నిలిచి యాజమాన్యాలు, అధికారులతో చర్చలు జరిపి పెద్ద మొత్తంలో నష్టపరిహారం అందించేలా కృషి చేసి విజయం సాధించింది.

వరదలు, తుపానుల కారణంగా నష్టపోయిన రైతాంగానికి అండగా నిలిచింది. 20 గ్రామాల్లో పర్యటించిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కౌలు రైతులకు శిస్తు తగ్గించాలని భూ యజమానులకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఒక్కో రైతుకి 10 బస్తాల చొప్పున శిస్తుని తగ్గించారు. తొండంగి మండలం కోదాడలో దళితులు సాగు చేసుకుంటున్న ఉప్పు చెరువు భూములను గత వైసిపి ప్రభుత్వంలో నాయకులకు చెందిన బినామీలు అన్యాక్రాంతం చేసి ఆక్రమించుకోవాలని చూస్తే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేసి దళితులకే భూములు దక్కేలా చేశారు. యు.కొత్తపల్లి మండలం పాత ఇసుకపల్లిలో చెరువు భూములను అనేకమంది పేదలు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు ఆ భూములను అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నం చేశారు. సామాన్యుల పక్షాన నిలిచి సిపిఎం పోరాటం చేయగా రాజకీయ పార్టీల నాయకులు వెనక్కి తగ్గారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి కరువై ఆకలితో అలమటిస్తున్నారు. రవాణా రంగం కూడా కుదేలైంది. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాలతో కలిసి సిపిఎం దశలవారీగా ఆందోళనలు నిర్వహించింది. కాకినాడ కలెక్టరేట్ వద్ద ప్రజాస్వామ్య యుతంగా ఎటువంటి ఆందోళనలు చేయరాదని గత ప్రభుత్వంలో నిర్బంధం విధించగా వివిధ ప్రజా సంఘాలు అండతో పోరాటం చేసి ధర్నా చౌక్ స్థలాన్ని సాధించగలిగారు. కరోనా, ఆ తర్వాత వివిధ సందర్భాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ, మజ్జిగ కేంద్రాలను నిర్వహించారు. నిర్మించి వదిలేసిన టిడ్కో ఇళ్లను అందించాలని దశలవారీగా ఆందోళనలు చేయగా ప్రభుత్వం దిగి వచ్చింది. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచాలని ఉద్యమం చేశారు. రౌతులపూడి మండలంలో అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా గిరిజనులు చేస్తున్న ఉద్యమానికి సిపిఎం నాయకులు అండగా నిలిచారు. బాంబు పేలుళ్లలో మరణించిన కుటుంబాల తరపున పోరాటం చేసి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేశారు. వైసిపి ఎంఎల్‌సి అనంత బాబు దళిత డ్రైవర్‌ను హత్య చేయడంతో బాధితుల పక్షాన నిలిచి పోరాడారు. మల్లం, శృంగవక్షం గ్రామాల్లో దళితులపై దాడి జరిగిన నేపథ్యంలో వారికి అండగా నిలిచి ప్రభుత్వంతో మాట్లాడి దాడులు పునరావతం కాకుండా కృషి చేసింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పలు సందర్భాలలో బాధితులను పరామర్శించి, వారికి అండగా నిలిచారు. ఇలా పీడిత ప్రజల పక్షాన నిలిచి గడచిన మూడేళ్లలో అనేక పోరాటాలను సిపిఎం నిర్వహించింది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకునేందుకు మహాసభకు సిద్ధమైంది.



ఆదిత్యలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం పోలీసులు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ షాహిద్దీన్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించి వాహనాన్ని నడపాలన్నారు. మనం చేసే పొరపాటు వల్ల మన కుటుంబంతోపాటు, ఇతరులు కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని, కావున తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. టూ టౌన్ ట్రాఫిక్ సిఐ డి.రామారావు మాట్లాడుతూ మానవుడు సంఘజీవి అని, సమాజంలో బతకడం నేర్చుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవడం సామాజిక బాధ్యత అని తెలిపారు. కొందరి జాగ్రత్త వల్ల పూడ్చలేని నష్టం జరుగుతుందన్నారు. వన్ టౌన్ ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్ మాట్లాడుతూ ట్రాఫిక్‌పై అవగాహన అనేది అభివృద్ధి చెందుతున్న దేశానికి సూచిక అన్నారు. సోషల్ మీడియాలో మోసాలు, హెల్మెట్ ఆవశ్యకత, ర్యాష్ డ్రైవింగ్ వల్ల అనర్థాలను వివరించి, విద్యార్థులకు సంబంధిత వీడియోల ద్వారా మరింత అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారి

శేషగిరిరావు సాహిత్య సేవలు మరువలేని

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాల తొలి తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు చేసిన సాహిత్య సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అధ్యక్షతన నిర్వహించిన శేషగిరిరావు శత జయంతి సభలో డాక్టర్ ఆలపాటి సుబ్బారావు పోచిరాజు శేషగిరిరావు సాహిత్య సేవలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్ పోచిరాజు జీవిత విశేషాలను వివరించారు. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు ఆయన సాహిత్యంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జెకె.విశ్వేశ్వరరావు, డాక్టర్ జి.ధర్మరాజు, ఆర్.ప్రభాకర్ రావు, టివి.రాఘవరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఎబిఎస్ఎన్ మూర్తి తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

కూటమి నేతలతో మంత్రి నారాయణ భేటీ

ప్రజాశక్తి - సామర్లకోట

అచ్చంపేటలోని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప నివాసంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షతన బుధవారం కూటమినేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని ఎంఎల్ఎలు, నియోజవర్గ ఇన్‌ఛార్జిలు పలువురు ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సాగునీటి సంఘాల ఎన్నికలు, కోపరేటివ్ సొసైటీలకు చైర్మన్లు మెంబర్ల ఎంపికపై, జిల్లాలో పార్టీల పరిస్థితులపై నేతల మధ్య సమన్వయంపై చర్చించినట్లు సమాచారం. ప్రజా సమస్యల పరిష్కారంపై కూటమి నేతలకు మంత్రి నారాయణ దిశా నిర్దేశం చేశారు. ఎంఎల్ఎలు చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, పంతం నానాజీ, టిడిపి జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), అజయ్ కుమార్, తోట సుధీర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎస్‌విఎస్.ఎన్ వర్మ, వాసిరెడ్డి ఏసుదాసు, తుమ్మలపల్లి రమేష్, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీహరి రాజు

ముగ్గురి హత్య కేసులో 12 మంది అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటి నిర్మాణ విషయంలో ఏర్పడిన వివాదంతో ముగ్గురు హత్యకు గురైన సంఘటనలో ముగ్గురు మహిళలు సహా 12 మందిని అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐలు ఎ.కృష్ణభగవాన్, అంకబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 15న వేట్లపాలెంలో బచ్చుల జకరయ్య వర్గీయులు చేసిన దాడిలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు. మరో ఏడుగురు చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. కొంతకాలంగా వీరి మధ్య స్థలం విషయమై వివాదం జరుగుతుండగా, కార్దాల పండు కుటుంబంపై బచ్చుల జకరయ్య వర్గం ఆకస్మికంగా కత్తులు కర్రలతో దాడులు చేశారాన్నారు. మొత్తం 18 మంది దాడిలో పాల్గొన్నట్లు గుర్తించగా ముగ్గురు మహిళలు సహా 12 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో బచ్చుల జకరయ్య, బచ్చుల మోషే, బచ్చుల బుల్లెప్పి, బచ్చుల దొరయ్య, బచ్చుల రాము, బచ్చుల గోపి , బచ్చుల గౌరయ్య, బచ్చుల రాజు, బచ్చుల సూర్యకాంతం, బచ్చుల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలను అరెస్ట్ చేసి వారి నుండి ఐదు కత్తులు మూడు కర్రలు ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్టు డిఎస్‌పి వివరించారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి మిగిలిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఎస్ఐ పివిఎస్ మూర్తి పాల్గొన్నారు.

డమ్మీ తుపాకీతో బెదిరించి దుకాణంలో ఆభరణాల చోరీ

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడలో పట్టపగలు ఒక దొంగ డమ్మీ తుపాకీతో హల్‌చల్ చేసి తనిష్క్ బంగారం షోరూమ్‌లోకి చొరబడి ఉద్యోగిని బెదిరించి ఆభరణాలు దోచుకెళ్లిన వైనం బుధవారం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఏటివార వార్ఫ్ రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో నిందితుడిని వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి డమ్మీ తుపాకీతో పాటు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కాండ్రకోటలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్ రావు తెలిపారు. ఆనూరు గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. తమ సిబ్బంది తో జగ్గంపేటలో దాడులు చేయగా స్థానిక నెహ్రూ కాలనీకి చెందిన సునీల్, రామవరం గ్రామానికి చెందిన సుధీర్ వద్ద ఉనంచి 2.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశ పెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. వారిని పెద్దాపురం సబ్ జైల్ కు తరలించినట్లు తెలిపారు.

14 కాసుల బంగారం, రూ.90 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరంలో 14 కాసుల బంగారం, రూ.90 వేల నగదు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బుజ్జిబాబు భార్యా పిల్లలతో జీవనోపాధి కోసం రాజమండ్రిలో నివాసం ఉంటున్నారు. బుజ్జి బాబు అత్త భీమవరపు సాయమ్మ ఆయన ఇంట్లో నివాసముంటోంది. ఈ నెల 14న ఇంటి దగ్గర్లోనే ఉంటున్న బంధువుల ఇంటికి ఆమె వెళ్ళింది. తెల్లారి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని బుజ్జిబాబు తెలిపారు. సమాచారం తెలుసుకుని రాజమండ్రి నుంచి రామవరం గ్రామానికి వచ్చి చూసేసరికి ఆటక మీద డబ్బాలో పెట్టిన 14 కాసులు బంగారం, బీరువాలో పెట్టిన రూ.90 వేల నగదు చోరికి గురికావడంతో పోలీసులకు పిర్యాదు చేసామని చెప్పారు. దీంతో స్థానిక సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథరావు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు.



చెక్కులను అందజేస్తున్న ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

డ్వాక్రా రుణాల చెక్కుల అందజేత

ప్రజాశక్తి - యానాం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో పుదుచ్చేరి అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా డ్వాక్రా మహిళలకు మంజూరైన చెక్కులను స్థానిక అంబేద్కర్ నగర్ మున్సిపల్ కళ్యాణ మండపంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయినట్టు డ్వాక్రా రుణాల కోసం అసెంబ్లీలో ప్రస్తావించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరక్టర్ శక్తివేల్, ఆర్ఎఒ మునిస్వామి, ప్రాజెక్టు ఆఫీసర్ జయంతి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకష్ణ, రమణ, గోపి పాల్గొన్నారు.

హుండీల ద్వారా రూ.5,92,471 ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలను సోమవారం లెక్కించగా రూ.5,92,471 ఆదాయం సమకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్ర కుమార్, ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరిపారన్నారు. 119 రోజులకు సంబంధించి ఈ హుండీల లెక్కింపు జరిగిందన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్ సుధారాణికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి



టి.సుధారాణి

ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరుకోటి సుధారాణికి జెఎన్‌టియు కాకినాడ డాక్టరేట్ ప్రదానం చేసిందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మెషీన్ లెర్నింగ్ బేస్డ్ మెథడ్స్ ఫర్ ప్రోటీన్ సీక్వెన్స్ క్లాసిఫికేషన్ అండ్ స్ట్రక్చర్ ప్రిడిక్షన్‌లో సమర్పించిన థీసిస్‌కు గాను ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి అభినందనలు తెలిపారు. గత దశాబ్దన్నర కాలంగా ఆదిత్య సంస్థల్లో విశేష సేవలందిస్తున్న సుధారాణి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

బాస్కెట్ బాల్ జట్టులోకి ఆదిత్య విద్యార్థినులు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థినులు జెఎన్‌టియుకె బాస్కెట్ బాల్ విమెన్ టీముకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. కేరళలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. జట్టుకు ఎంపికైన పి.మాధవి, బి.విజయ దుర్గను ఆదిత్య విద్య సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి అభినందించి, చెరో రూ.5000 నగదు అందించారు.

మంత్రి నారాయణకు మున్సిపల్ సిబ్బంది వినతి

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం మున్సిపల్ ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ సిబ్బంది తమ సమస్యలపై మంత్రి పి.నారాయణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. 10 రోజులుగా సమ్మె చేస్తున్న సిబ్బంది మంత్రి పొంగూరు నారాయణకు అచ్చంపేటలో ఎంఎల్‌ఎ చినరాజప్ప గృహంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర నాగేశ్వరరావు, సుంకర సత్తిరాజు, వెంకటరమణ, రామకృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇద్దరు దేవస్థానం ఉద్యోగుల సస్పెన్షన్

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. బుధవారం ఇఒ వీర్ల సుబ్బారావు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో కేశఖండనశాలలో విధుల పట్ల అలసత్వం వహించిన గుమస్తా ఎం.మల్లేశ్వరుడు, యడ్ల బుల్లాబ్బయిని సస్పెండ్ చేశారు. రెండు రోజుల కిందట బాధ్యతలు చేపట్టిన ఇఒ సుబ్బారావు విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.


వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక వాకలపూడి పంచాయతీ పరిధిలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యాన వికలాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంఎల్‌ఎ పంతం వెంకటేశ్వరరావు పాల్గొని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. 75 మందికి కృత్రిమ పరికరాలు అందజేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో వికలాంగులకు చేసే సేవా కార్యక్రమాల్లో తన వంతు సహకారి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పుష్కర ఎత్తిపోతల డిసి చైర్మన్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి-తుని



కుర్రా వెంకటరమణ

పుష్కర ఎత్తిపోతల డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్‌గా తుని రూరల్ వల్లూరు గ్రామానికి చెందిన కుర్రా వెంకటరమణ ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుచీ యనమల రామకృష్ణుడు వెంట ఉండి, టిడిపి అభివృద్ధికి ఆయన పని చేశారు. గతంలో సర్పంచ్‌గా ఆయన పని చేశారు. యనమల రామకృష్ణుడు, యనమల దివ్యకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు. పుష్కర కాలువ ఎత్తిపోతల ఆయకట్టు కింద ఉన్న మెట్ట ప్రాంత రైతులందరికీ పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఏలేరు ఇరిగేషన్ ఆధునికీకరణకు రివైజ్డ్ డిపిఆర్

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కొత్తగా ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాల సలహాలు, సూచనలతో ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థ ఆధునీకరణకు రివైజ్డ్ డిపిఆర్ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా సమీక్షా కమిటీ నిర్ణయించిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో కాకినాడ జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా అభివృద్ధికి జరుగుతున్న కార్యక్రమాల ప్రగతి, చేపట్టవలసిన భవిష్యత్ ప్రణాళికలపై విస్తతంగా చర్చించి నిర్ణయాలను తీసుకున్నారు. ఇందులో భాగంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ, వ్యవసాయం, పురపాలన, పట్టణాభివద్ధి, మెప్మా, కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, తాగునీటి సరఫరా, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. సమావేశంలో సూచించిన అంశాలు, నిర్ణయాలపై ప్రాధాన్యతలకు అనుగుణంగా సత్వర చర్యలు చేపట్టి, వచ్చే డిఆర్‌సి సమావేశం లోపు అన్నిటిపై చర్యలు పూర్తి చేయాలని నారాయణ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన సమావేశంలో చర్చించిన అంశాలను మీడియా ప్రతినిధులకు ప్రెస్ మీట్‌లో వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, బొర్రా గోపి మూర్తి, ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎస్విఎస్ఎన్ వర్మ, మర్రెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన పాల్గొన్నారు.

జీడిపిక్కల పరిశ్రమను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమను కార్మికులు ఐక్య పోరాటంతోనే పరిశ్రమను కాపాడుకోవాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షుడు కరణం విశ్వనాథం పిలుపునిచ్చారు. జీడిపిక్కలు ఫ్యాక్టరీ కార్మికుల పోరాటం బుధవారానికి 33వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ధర్నా శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. యాజమాన్యం, ప్రభుత్వం కలిసి కార్మికులను నడిరోడ్డు మీద పడవేయడం సరికాదని వారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అనుమతులు లేకుండా మూసివేసిన పరిశ్రమను తెరిపించి 409 మంది ఉపాధి కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు యాజమాన్యం దిగి రాకపోతే కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యాజమాన్యాలు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు ఉపయోగించుకుని అర్ధాంతరంగా మూసివేసి వెళ్లిపోతే కార్మికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, ఎ.వీరబాబు, కె.చక్రధర్, గోవిందు, ధర్మాజీ, కాంతారావు, వీరబాబు, ఎస్.జయలక్ష్మి, పాపారత్నం, అన్నపూర్ణ, వై.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో సిపిఆర్‌పై అవగాహన, శిక్షణ

ప్రజాశక్తి -కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఐడిఎ ఆధ్వర్యంలో బుధవారం సిపిఆర్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ గుండెపోటు కారణంగా ఏటా దాదాపు 5.8 కోట్ల మంది మరణిస్తున్నారని తెలిపారు. గుండెపోటు సమయంలో, రోగికి ఆకస్మిక రక్త ప్రసరణ, శ్వాసను పునరుద్ధరించడానికి అత్యవసర ప్రక్రియ అయిన హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం (సిపిఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే ఆ చర్యల పునరుద్ధరణకు అత్యవసర ప్రక్రియ చేయాలన్నారు. గుండెపోటు సంభవించినప్పుడు ప్రాణాలను కాపాడటానికి ఇది చాలా కీలకమైన, ప్రాథమిక విధానం అన్నారు. సిపిఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు తెలిపి, వారితో సిపిఆర్ చేయించి శిక్షణ ఇచ్చారు. ఈ విధానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గుండె వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలను, ఆహార పలవాటులను వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కోటనందూరు, పెద్దాపురం, తాళ్లరేవు

రైతుల అభివద్ధి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం తుని రూరల్ వల్లూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దివ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దరు జి.ప్రసాదరావు, కూటమి నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, కుర్ర వెంకటరమణ, చోడిశెట్టి గణేష్, దంతులూరి శ్రీనివాసరాజు, పోలిశెట్టి రామలింగేశ్వర రావు, మార్కేండేయులు, అరిగెల నర్సింహమూర్తి, కొత్తూరి చంటిబాబు పాల్గొన్నారు.

పెద్దాపురం జె.తిమ్మాపురంలో టిడి కె.కాంతారావు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 11 దరఖాస్తులు అందజేశారు. నెల రోజుల్లోగా వీటిని పరిష్కరిస్తామని డిటి తెలిపారు. ఈ సదస్సులో విఆర్‌ఒ యేసు ప్రసాద్, టిడిపి నాయకులు కందుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు గతంలో జరిగిన రీ సర్వేలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబును కోరారు. గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల ముగింపు

ప్రజాశక్తి-యంత్రాంగం

గొల్లప్రోలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై బుధారం రెండో రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిడిఒ కె.స్వప్న, విద్యాసాగర్, కుమార్ పాల్గొన్నారు

సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడివో కె.హిమ మహేశ్వరి రెండోరోజు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. మాస్టర్ ట్రైనీ వేద్రాది శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి భైరవమూర్తి పాల్గొన్నారు.

పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో క్షణా తరగతుల ముగింపు సభలో ఎంపిడిఒ శ్రీలలిత మాట్లాడారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బళ్ల చంద్ర కిరణ్, దివిలి పశు వైద్యాధికారి మస్తాన్‌బీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.వెంకట రమణమ్మ, ఇఒపిఆర్‌డి రమణ, కార్యాలయ ఎఒ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపిపి చలగళ్ల దొరబాబ ు, ఎంపిడిఒ నాతి బుజ్జి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటనందూరు ఎంపిపి లగుడు శ్రీనివాస్, ఎంపిడిఒ వెంకటనారాయణ, ఆర్‌డబ్ల్యు ఎఇ ఎ.శివాజీ, ప్రజా వైద్యాధికారి టి.యామిని, డాక్టర్ సుధాకర్, ఐసిడిఎస్ కె.శ్రీలత, ఇఒపిఆర్‌డి ఎస్.జైరామ్ పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది

ప్రియ ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -కాకినాడ

శాంతినగర్ ప్రియ హోటల్ మేనేజ్మెంట్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంఠ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తాడి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రియ హోటల్ మేనేజ్‌మెంట్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి దిగ్విజయంగా పదేళ్ల పూర్తి చేసుకుని 11వ సంవత్సరంలో అడుగుపెట్టామన్నారు. స్థాపించిన సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఈ క్రిస్మస్ వేడుకలను సంక్రాంతి సంబరాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకల్లో చైర్మన్ తాడి పావని, రమేష్, అగస్త్య సుశీల్ మోహన్ కుమారి సత్యానందం, నవీన్, వేణు రవి పవన్ తేజ్ పాల్గొన్నారు.

పి.నాయకంపల్లిలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-గండేపల్లి

కె.నాయకంపల్లి, పి.నాయకంపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మండలం వ్యవసాయ అధికారి ఎ.సద్గురుమూర్తి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ-24-25 పంట నమోదు ప్రారంభమయ్యిందని, దాళ్వా పంట సాగు చేసే ప్రతి రైతూ పంట నమోదుతో పాటు రబీ-24-25 ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన కింద ఆధార్, పట్టాదారు, బాంక్ బుక్, సాగు ధ్రువీకరణ పత్రంతో దగ్గరలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

క్షేత్రస్థాయిలో వేతనదారులకు సకాలంలో పనులు కల్పించాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నాతి బుజ్జి ఉపాధి హామీ ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో వేతనదారులకు పని కల్పించే సమయం, సరాసరి వేతనం, అగ్రి అలైడ్ పనులపైన సమీక్షించారు. తప్పనిసరిగా ప్రతి వేతనదారునికీ రూ.300 వచ్చే విధంగా పని చేయించాలని క్షేత్రస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పని అడిగిన వారందరికీ పని కల్పించి మండలానికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు.